# నేటి పీఠాధిపతులు

మనిషి తన జీవితములో ధర్మము అను పద్దతి ప్రకారము ప్రవర్తించుటకు, జీవితము అను ప్రయాణములో నిర్ధేశిత గమ్యమును తెలిసి బ్రతుకుటకు, అవసరమైన జ్ఞానమును జగతి పుట్టినపుడే దేవుడు తెలియజేశాడు. కాలగమణములో ఆత్మజ్ఞానమును మరచిన మనిషి తనెవరో, ఎక్కడి నుంచి వచ్చి ఎక్కడికి పోవుచున్నాడో, తనకే తెలియకుండ పోయినది. ఇటువంటి పరిస్థితులలో దైవఅంశతో పుట్టిన ప్రవక్తలు కొందరు దైవమును గురించి తెలియజేసినప్పటికి వాటిని అర్థము చేసుకోలేని మనిషి మతములను సృష్ఠించుకొని మానవత్వము నుండి మరికొంత దిగజారాడు. సమస్త సృష్ఠికి ఒక్కడే అధిపతియని, మానవ జాతియంత ఒక్కటేనని 5150 సంవత్సముల పూర్వము భగవద్గీత రూపములో తెలియబడినది. అలాగే 2004 సంవత్సరముల పూర్వము పరిశుద్ధ బైబిలు రూపములోను, దాదాపు 1400 సంవత్సరముల పూర్వము పవిత్ర ఖురాన్ రూపములోను తెలియబడినది. అయినప్పటికి మనిషి ధర్మమను దానిని విస్మరిస్తూనే వచ్చాడు. దైవజ్ఞానము నుండి దిగజారిన మనిషి ఆదినుండి విశ్వవ్యాప్తమైన ఇందుత్వము నుండి హిందువుగ, క్రైస్తవునిగ, ముస్లీమ్‌గా మరియు ఎన్నో తెగలుగ మారిపోయాడు.

కృతయుగములోనే ఇందువునుండి హిందువుగ మారిన తెగలో దేవుని అంశ అయిన శ్రీకృష్ణుడు ఉద్భవించి అసలయిన దైవజ్ఞానమును తెలియజేశాడు. 5150 సంవత్సముల పూర్వము తెలియజేసిన భగవద్గీత నూటికి నూరుపాల్లు శాస్త్రబద్ధమైన ధర్మములతో కూడుకొన్నదై ఉన్నది. అయినప్పటికి తర్వాత వచ్చిన గురువులనబడు వారు దానిని కూడ తమసొంత శ్లోకములతో కొంత కలుషితము చేశారు. గీతలో ఉన్న ఆ కొంత కలుషితమును తీసివేస్తే అది ప్రపంచ వ్యాప్తమయిన అన్ని మతముల మనుషులకు వర్తించబడు ధర్మమగును.

ఇందూమతములోని భాగమే హిందూమతమని గ్రహించని కాలములో క్రీస్తు శకము 677 సంవత్సరము లపుడు కేరళ రాష్ట్రములో ఆది శంకరాచార్యుడు పుట్టి, హిందూమతములోనే అద్వైతమను సిద్ధాంతమును ప్రతిపాదించి శైవ సమాజమును స్థాపించి, తనకొక గుర్తింపు తెచ్చుకొన్నాడు. ఆనాడు శంకరాచార్యులు ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతము నేటికి అద్వైత పీఠముగ భారతదేశములో గలదు. శంకరాచార్యుల ప్రతినిధులుగ అద్వైత సిద్ధాంత పీఠాది పతులు కూడ గలరు. వారిలో ఇప్పటి కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి అందరికి తెలిసిన వాడే.

క్రీస్తు శకము 970 సంవత్సములపుడు తమిళనాడు రాష్ట్రములో రామానుజాచార్యులు పుట్టి హిందూమతము లోనే విశిష్ట ద్వైతమను సిద్దాంతమును ప్రతిపాదించి, వైష్ణవ సమాజమును స్థాపించి, తనకొక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకొన్నాడు. ఆ కాలములో రామానుజాచార్యులు ప్రతిపాదించిన విశిష్ట ద్వైత సిద్ధాంతము ఇప్పటికి మన దేశములో కలదు. ఆనాటి రామానుజాచార్యుల యొక్క ప్రతినిధులుగ విశిష్టద్వైత పీఠాధిపతులు నేటికిని గలరు. వారిలో ఇప్పటి చినజియార్ స్వామి సుపరిచితుడే.

ఈ విధముగ హిందూమతములో నేటికిని ఉన్న పీఠములు, పీఠాధిపతులు సమాజమునకు ఏమి చేశారని చూడగా! కృతయుగములోనే తెలియజేయబడిన ఆత్మజ్ఞానమునకు సంబంధించిన చిహ్నములను

తాము ఉపయోగించుకొని తమ సమాజములను తయారు చేసుకొన్నారు. దేవునికి చిహ్నమైన శివలింగమును అద్వైతులు ఆరాధ్యదైవముగ తీసుకొని, తమకు అనుకూలమైన పురాణములను వ్రాసుకొని, శివలింగమును ఫణి భూషణుడైన శంకరునిగ పోల్చి శాపమువలన గుండుగ మారాడని చెప్పుకొన్నారు. పరమాత్మకు (దేవునికి) చిహ్నమైన లింగమును శంకరునిగ చెప్పుటయే కాక, లింగము మీద మూడు రేఖలుగ తీర్చిదిద్దబడిన తెల్లని విభూతిరేఖలను కూడ అర్థహీనము చేసి ధరించడమేకాక, హిందూమతములోనే ఒక తెగకు సంబంధించినవిగ చేసి ధరింపజేశారు.

అద్వైతము తర్వాత మూడు వందల సంవత్సరముల తేడాతో బయల్పడిన విశిష్టద్వైతము యొక్క పీఠాధిపతులు కూడ కృతయుగములోనే తెలుపబడిన దైవజ్ఞానమునకు సంబంధించిన గుర్తులయిన మూడు నిలువు నామములను వైష్ణవుల చిహ్నములుగ చెప్పుకొనుచు వాటి ఔన్నత్యమును తెలియకనే నుదుటి మీద ధరించుచున్నారు. భగవంతునికి ప్రతిరూపమైన నామాలుగల వేంకటేశ్వరుడు మొదలగు ఆకారప్రతిమలను తమ ఆరాధ్య దైవముగ చెప్పుకొనుచున్నారు. రూపముగల రంగడు, వేంకటేశ్వరుడు మొదలగు నామములుగల ప్రతిమలను వైష్ణవ దేవుళ్ళుగ పోల్చి చెప్పుచున్నారు.

ఈ విధముగ హిందూమతములోనే శైవ, వైష్ణవ తెగలను కల్పించి ఇతర మతముల ముందర హిందూ మతమును రక్షించలేక పోయారనుటకు ఎన్నో తార్కాణములు గలవు. హిందూమతములోని ఆడవారు ఇతర మతస్థులను వివాహము చేసుకొనుచున్నను మతమును గురించి పట్టించుకోలేదు. అదే ముస్లీమ్ మతములోని netipatadhipathulu_05 ఆడవారు ఇతర మతస్థులు పెళ్లి చేసుకోవాలంటే తప్పని సరిగ ముస్లీమ్ మతమును స్వీకరించవలసిందే. ఆ మతములోని క్రమశిక్షణ, మతరక్షణ ఎంతో ఉన్నతముగ ఉండగ, హిందూమతములో పేరు పొందిన సినీ నటీమనులు సహితము తమ మతమంటే ఏమిటో తెలియని స్థితిలో ఇతర మతస్థులను వివాహమాడి వారి మతములలోని క్రమశిక్షణా ఆచారములను ఆచరిస్తున్నారు. ఇంత జరుగుచున్నను మేము హిందూమతములోని పీఠాదిపతులమని ద్వైతులు, అద్వైతులు చెప్పుకొనుచు హిందూమతమును గురించి, దాని అభివృద్ధిని గురించి పట్టించుకోవడము లేదు. హిందువులకు ఆధార గ్రంథము భగవద్గీత అని కూడ తెలియని వారు నేటికిని 60 శాతము హిందువులలో గలరు. కనీసము మేము హిందువులమని తెలియని వారు 20 శాతము గలరు. మీరు ఎవరని ప్రశ్నించితే మేము తెలుగువాళ్ళమని వాళ్ళు ముస్లీమ్‌లని భాషను బట్టి చెప్పువారు గలరు. క్రైస్తవులలో, ముస్లీమ్‌లలో వారి మతగ్రంథములను సాధ్యమున్నంత వరకు అందరు కొంతయిన చదివి ఉందురు. ఒక వేళ చదవకపోయిన కొంత తెలిసినవారయిన ఉందురు. హిందూమతములో గీతను చదవని వారు 90 శాతము గలరు.

సాధారణ ప్రజలు ఎంతో అజ్ఞానులై ఉండగ, పీఠాధిపతులు వారిని ఉద్ధరించు స్థితిలో లేక తమ అద్వైతము గొప్పదని, తమ విశిష్ట ద్వైతమే గొప్పదని ఆయా పీఠాధిపతులు చెప్పుకొనుచున్నారు. మా పంచాక్షరి మంత్రము గొప్పదని ఆరు అక్షరముల మంత్రమును అద్వైతులు చెప్పుచుండగ, మా అష్టాక్షరి మంత్రము గొప్పదని ఎనిమిది అక్షరముల మంత్రమును విశిష్ట ద్వైతులు చెప్పుచున్నారు. మంత్రమందు

గల అక్షరములలోనే అవకతవకలున్నాయని గ్రహించక వారిని వారు సమర్థించుకొనుచున్నారు. సంస్కృత భాషను నేర్చినంతమాత్రముననే మేము గొప్ప వారమని మత పెద్దలమని అనుకొనుచున్నారు తప్ప మతములోని లోపములను గాని, మత క్షీణతను గాని ఏమి పట్టించుకోవడము లేదు. సమాజములో మతకలహములు ఏర్పడుచున్నను వాటిని నివారించలేక పోవుచున్నారు.

ఇటువంటి సందర్భములో హిందూమతమునందు 25 సంవత్సరములనుండి చిన్న మొలకై పుట్టినది త్రైతసిద్ధాంతము. త్రైతసిద్ధాంతమును ప్రతిపాదించినది శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు. త్రైతము హిందూమతము ఒకప్పుడు ఇందూమతముగ ఉండెడిదని చెప్పుటయేకాక అన్నిమతములకు సంబంధించిన మూల ధర్మములను బోధిస్తున్నది. త్రైతమును తెలిసినవారు మతమంటే ఏమిటో తెలిసి మతములు మారకుండ నిలిచి పోవుచున్నారు. ఇతర మతస్తులు కూడ మేము ఇందువులమని వారి నోటితో వారే చెప్పునట్లు చేయుచున్నది త్రైతము. త్రైతమును ఏ మతస్థులు విభేదించలేరు. ధర్మములంటే ఏమిటో తెలియజేసి మానవులందరికి దేవుని తెలుసుకోవడమే ముఖ్యమైన ధర్మమని తెల్పినది త్రైతము. త్రైతసిద్ధాంతము ప్రకారము మతములలో విభేదములే ఉండవు. గీత శాస్త్రబద్ధమైనదని తెల్పి నాస్తిక హేతువాదులకు కూడ జవాబిచ్చునది త్రైతము. ఆస్తికులలోని మూఢ నమ్మకములను ఖండిస్తు, హేతువాదులకు శాస్త్రబద్ధతను చూపిస్తు, ఏ మతము విమర్శించలేని స్థితిని గల్పించినది త్రైతసిద్ధాంతము.

ఇస్లామ్‌ను బోధించిన మహమ్మద్ ప్రవక్త, క్రైస్థవ సంఘమును నెలకొల్పిన ఏసు మొదట ఎన్నో కష్టములనెదుర్కొన్నారు. అలాగే క్రొత్తదయిన, అన్ని మతస్థులకు అవసరమయిన, అసలయిన దైవ ధర్మములను నెలకొల్పు త్రైతసిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద కూడ సమాజములో ఎన్నో వ్యతిరేఖతలను కష్టనష్టములను ఎదుర్కో వలసి వచ్చినది. అయినప్పటికి నేటి సమాజములోని దైవమార్గమందు త్రైతసిద్ధాంతము తప్పనిసరి అవసరము.

నేడు తిరుపతి తిరుమలలో గల వేంకటేశ్వరుని ఆలయప్రాంగణ నిర్మాణములో అద్వైతులకు విశిష్టా ద్వైతులకు విభేదాలు రావడము చాలామందికి తెలుసు. వైష్ణవులైన మేము తప్ప శైవులైన అద్వైత జయేంద్ర సరస్వతి జోక్యము చేసుకోకూడదని చినజియార్ స్వామి చెప్పడము, హిందూమతములోని పీఠాధిపతులము మాకు మాట్లాడే హక్కుగలదని జయేంద్ర సరస్వతి చెప్పడము జరిగిన విషయమే. ఆగమ శాస్త్రము ప్రకారమే ఆలయముండవలెనని చినజియార్ స్వామి చెప్పడము జరిగినది. దీనినంతటిని చూచిన త్రైతసిద్దాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులయిన మేము ఈ విధముగ ప్రశ్నించుచున్నాము.

దేవాలయము ప్రజలకు దేవున్ని తెలుపు జ్ఞానమును అందించునదిగ ఉండవలెను. గృహము ప్రజల వసతులకు తగినట్లుండవలెను. అట్లుగాక లేని వాస్తు శాస్త్రమును కల్పించి ప్రజల మీద దిద్దినట్లు, దేవుని విషయములయిన ఆలయనిర్మాణములో లేని ఆగమశాస్త్రమును కల్పించి భక్తుల మీద దిద్దడము సరియైన పనికాదు. **జ్యోతిష్య శాస్త్రము సంపూర్ణముగ తెలిసిన మాకు మానవుని ఇంటికి వాస్తుశాస్త్రము గాని, దేవుని ఆలయమునకు ఆగమశాస్త్రము గాని లేదని తెలుసు.** దేవాలయములోని నిర్మాణములు దేవున్ని తెలుపు

జ్ఞానమును బోధించునవని, వాటిని పూర్వమెలా నిర్మించారో, అవి ఇపుడు ఎలా మారిపోయి అధర్మయుక్తమై పోయాయో కూడ తెలుసు. పూర్వము నిర్మాణమునకు ఇప్పటి నిర్మాణమునకున్న తేడాగాని, వాటి అర్థముగాని తెలియని వారు మేము పీఠాధిపతులమని చెప్పుకోవడము, వారు గొప్పవారని పరిపాలకులనుకోవడము, ధర్మమును ప్రచారము చేయమని కోట్ల ధనము ఇస్తామనడము విచిత్రముగ ఉన్నది.

దేవాలయములలోని ఇప్పటి పరిస్థితి పోయి వాటి నిర్మాణవాస్తవికత మరియు వాటి నిర్మాణమందు చొప్పించబడిన ధర్మములు జ్ఞానము తెలియబడితే ప్రజలలో నేడున్న అవినీతిగాని, అక్రమాలుగాని, అన్యాయములుగాని ఉండవు. నిజ జ్ఞానము, నిజ ధర్మము తెలియనంతవరకు ఏ పోలీస్ వ్యవస్థగాని, ఏ ప్రభుత్వముగాని మానవున్ని మార్చలేవు. హిందువులు ముస్లీమ్‌లు కలసి పోవాలన్నా కూడ వారికి వారి వారి జ్ఞానము అవసరము. అందరికి అవసరమయిన వాస్తవికతేమిటో, సమాజము సక్రమముగ నడువగల జ్ఞానమేమిటో దానిని అందించుటకు పాలకులు పీఠాధిపతులు కృషిచేయవలెనని కోరుచున్నాము.

ఇట్లు

ఇందూ ధర్మప్రదాత,

సంచలనాత్మక రచయిత, త్రైత సిద్ధాంత ఆదికర్త

**శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు**